

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపిన గ్రామ పంచాయతీ కార్మికులు..



పచ్చగడ్డితింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

**వెల్దండ,జూలై 30 ప్రభాతవార్త:**గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం వెంటనే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ చేపట్టిన దీక్ష 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు పచ్చగడ్డి తింటూ తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేశారు. ఈసందర్భంగా జిల్లాఅధ్యక్షులు మురళీధర్ మాట్లాడుతూ జీవో నెం.60 ప్రకారం స్వీపర్లకురూ.15,600లు,కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500ల వేతనాన్ని పెంచాలని,జీవోనెం.51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి ప్రమాదం జరిగిన మృతిచెందిన కార్మిక కుటుంబానికి రూ.10లక్షల నష్ట పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విమల్,కార్యదర్శిబొజ్జయ్య,మండల అధ్యక్షులు యాదయ్య, ఉపాధ్యక్షులు మహిపాల్,లక్ష్మీనారాయణ,రమేష్,నరేష్,రుక్కయ్య తదితరులు ఉన్నారు.

## రైతన్నను మోసం చేస్తే సహించేది లేదు..

- నకిలీ విత్తనాల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి...
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...
- ఎంపీ పోతుగంటి రాములు



పొలం దున్నతున్న ఎంపీ రాములు

**వంగూరు, జూలై 30 ప్రభాతవార్త:**వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం కొనసాగిస్తూ దేశ ప్రజలకు బుక్కెడు బువ్వను పెడుతున్న రైతన్నను మోసం చేసేందుకు వ్యాపారస్థులు చూస్తే సహించేది లేదని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు హెచ్చరించారు. ఆదివారం జాజాల గ్రామ శివారులోని రైతులు వ్యవసాయ పొలంలో సాగు చేసిన పంటల్లో మొలకెత్తిన కలుపును తొలగించేందుకు కట్టిన కాడెద్దుల గుంటుకను ఎంపీ రాములు రైతులతో కలిసి పొలం దున్నారు. ఈ సందర్భంగా రైతు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఆరుగాలం వ్యవసాయమే పనిగా పెట్టుకొని చెమటోడ్చి పంటను పండిచేందుకు కష్టపడుతూ ఎండ, వానను తట్టుకొని లాభా నష్టాలను ఎదుర్కొంటూ సాగు చేస్తున్న పంటలకు వ్యాపారస్థులు రైతన్నను మోసం చేయకుండా నకిలీ విత్తనాలను విక్రయించకుండా వ్యవసాయినికి తోడ్పాటునందించాలని ఆయన సూచించారు. వ్యాపారస్థులు నకిలీ విత్తనాలను విక్రయించకుండా వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. రైతన్న మేలు కోసం వ్యవసాయాధికారులు పొలాల్లో భూ పరీక్షలు నిర్వహించి ఏ పంటను సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయో సూచించి ఎప్పటికప్పుడు రైతులకు పంట సాగు విషయంలో పంటలకు ఏ సమయంలో ఏ మందులు పిచికారి చేయాలో వివరించి రైతుల అభివృద్ధి కోసం తోడ్పడాలని ఎంపీ రాములు పేర్కొన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతు మెమోలో చిరునవ్వును చూడటానికి వ్యవసాయ సాగుకు ఇబ్బందులు లేకుండా ఎకరానికి రూ.6వేల పెట్టుబడి సహాయం అందిస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు కుటుంబాన్ని ఆదుకోవడానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను అందిస్తూ రైతు ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతు అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నారని ఆయన సూచించారు.

## పేద ప్రజలకు సీఎం సహాయనిధి గొప్పవరం..

**సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే**



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**గద్వాలప్రతినిధి,జూలై 30 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దకల్‌మండల పరిధిలోని వివిధగ్రామాలకు సంబంధించిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్దిదారులలో ఈరన్నకు చికిత్స నిమిత్తం రూ.38వేలు, పెద్ద నర్సింహులుకు రూ. 27 వేలు, అశోక్‌కు రూ. 12 వేల చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరమైన పేదప్రజలు వైద్యంకోసం ఖర్చు పెట్టిన డబ్బులను సీఎం సహాయనిధి ద్వారా 50శాతం డబ్బుల రూపంలో లబ్దిదారులకు అందజేయడం జరుగుతుంది. కరోనా కష్ట సమయంలో కూడా పేద ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కెసిఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళి దౌలు, నాగరాజు, మండల కో ఆప్షన్ మెంబర్ హైదర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సతీష్, చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంట పొలాలను పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికే ఇథనాల్ కంపెనీ పెట్టారు..



ధర్నాలో మాట్లాడుతున్న ప్రొ॥ రత్నం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 30 ప్రభాతవార్త :** చిత్తనూరు ఇథనాల్ కంపెనీ ఎదురుగా ఎక్లాస్‌పూర్ గేటు దగ్గర ఆదివారం నిరవధిక రిలే ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు చిత్తనూరు ఇథనల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీలో భాగస్వామ్య సంఘంగా ఉన్న కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొ॥ కె.వై. రత్నం వచ్చి ప్రారంభించారు. అదేవిధంగా ధర్నాలో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, రాష్ట్ర కో కన్వీనర్ సాంబయ్య, పాలమూరు అధ్యయన వేదిక నారాయణపేట జిల్లా కన్వీనర్ వెంకట్రాములు, కో కన్వీనర్ సుదర్శన్, కెఎన్‌పిఎస్ నాయకులు సుదర్శన్, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, ఆల్ ఇండియ కన్వీనర్ బండారి – మిగతా3లో..

## కోయిల్‌సాగర్ సాగునీటి విడుదలకు ముహూర్తం ఖరారు..

**- ఆగస్టు 1న ఆయకట్టుకు నీటివిడుదల - హాజరుకానున్న దేవరకద్ర,నారాయణపేట ఎమ్మెల్యేలు**



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

**దేవరకద్ర,జూలై30 ప్రభాతవార్త:**జిల్లాలోని భారినీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ సాగునీటి విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఆగస్టు1న కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుండి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయ నున్నారు.ప్రాజెక్టు కుడి,ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు ఈ సాగు నీటిని విడుదల చేస్తారు.ఆ రోజు కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద ఉదయం 10గంటలకు జరుగు ఈ కార్యక్రమానికి దేవరకద్ర,నారాయణపేట ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వంరెడ్డి,రాజేందర్‌రెడ్డిలు హాజరవుతున్నారు. కావున ఈ కార్యక్రమానికి ఆయకట్టు రైతులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, మండల రైతు సమన్వయ కమిటి సభ్యులు,ప్రజాప్రతినిధులు, సంబందిత శాఖల అధికారులు అధి కసంఖ్యలో హాజరుకావాలని యంపీపీ రమాశ్రీకాంత్‌యాదవ్ కోరారు.

# కులవృత్తులకు భరోసా..!

**అన్నం పెట్టిన ప్రభుత్వానికి అండగా ఉండాలి.. అభివృద్ధి విగాతకుల పట్ల అప్రమత్తత అవసరం..**

**రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,జూలై 30 ప్రభాతవార్త :** తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ ప్రజలందరికి అందించాలని ముఖ్యమంత్రి కెసిఆర్ కృతనిశ్చయంతో ఉన్నారని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తెలంగాణలో కురుమ, యాదవుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఉచిత గొర్రెల పంపిణీ పథకాన్ని దేశమంతా అమలు చేసేందుకు సీఎం కెసిఆర్ ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన రెండో విడత ఉచిత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని జైనల్లిపూర్, కోడూరు, మాచన్‌పల్లి గ్రామాలకు చెందిన లబ్దిదారులకు 18 యూనిట్ల గొర్రెలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి కులవృత్తులను ఆదుకున్నది సీఎం కెసిఆర్ మాత్రమేనని మంత్రి తెలిపారు. అన్ని కులవృత్తులను ప్రోత్సహించి వృత్తిదారుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. ఒకప్పుడు ఆదివారం వచ్చిందంటే చాలు వందల సంఖ్యలో ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలను తీసుకొచ్చి స్థానికంగా విక్రయించే వారిని అయితే ఉచిత గొర్రెల పంపిణీ పథకం ప్రవేశపెట్టిన తర్వాత స్థానికంగానే గొర్రెల సంపద భారీగా పెరిగిందని మంత్రి వెల్లడించారు. కురుమ, యాదవుల జీవితాల్లో కెసిఆర్ గొప్ప మార్పును తీసుకువచ్చారన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి లబ్ది పొందుతున్న వారంతా ఈ ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించాలని, గతానికి నేటికీ తేడాను గమనించాలని మంత్రి కోరారు. సంక్షేమ పథకాలు అంది ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటే ఓర్వలేని కొందరు ప్రతిపక్ష నేతలు ఈ పథకాలను ఎలాగైనా పోగొట్టాలనే కుట్రతో విద్వేషాలు రాజేస్తున్నారని మంత్రి విమర్శించారు. ఇలాంటి అభివృద్ధి విఘాతకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, సింగిల్ విండో ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఆంజనేయులు,



గొర్రెలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, జిజిహెచ్ సలహామండలి సభ్యుడు సత్యం యాదవ్, పశుసంవర్ధకశాఖ ఏడీ వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమంలో నంబర్ వన్

**ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

ఎస్సీ, ఎస్టీల సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలుస్తోందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్లే ఎస్సీ, ఎస్టీల సంక్షేమం సాధ్యమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. అందరికీ విద్యనందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో గురుకులాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. దళితబంధు ద్వారా పేద ఎస్సీలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఎస్సీ, ఎస్టీలకు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, సచివాలయానికి బాబా సాహెబ్ పేరుపెట్టి ఆ మహనీయుని అడుగుజాడల్లో ఈ ప్రభుత్వం ఉందని చాటి చెప్పినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసుల విషయంలో నష్టపరిహారం వెంటనే అందే విధంగా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై వేధింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2014 కన్నా ముందు ఎస్సీ, ఎస్టీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వివిధ అంశాలపై ప్రజలను చైతన్యం చేయడం వలన సమస్యలు తగ్గాయని అన్నారు. అధికారులు సైతం మానవీయ కోణంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జనవరి నుండి జూన్ వరకు జరిగిన కేసులకు సంబంధించి కుల ధృవపత్రాల జారీ, ఎక్స్‌గ్రేషియా, ఇతర బెనిఫిట్స్ తదితర అంశాలపై వివరించారు. జిల్లా ఎస్పీ పి. నరసింహులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులలో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు, 60 రోజుల్లోపు ఇన్వెస్టిగేషన్ పూర్తి, ఛార్జ్‌షీట్, 60 రోజులలో కేసు పూర్తి చేయడం, కోర్టు పరిధిలో ట్రయల్, పర్యవేక్షణ, ప్రతినెలా వీటిపై సమీక్షిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు పాటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి పాండు, డిఆర్‌డిఓ యాదయ్య, ఆర్డీఓ అనిల్‌కుమార్, డిటిఓ చత్రునాయక్, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బాలయ్య, బాలరాజు, కావలి కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారత భాగ్య విధాత పీవీ నరసింహారావు..!

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 30 ప్రభాతవార్త:**భారత భాగ్య విధాత పీవీ నరసింహారావు అని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి కొనియాడారు. నాగం కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని బస్టాండ్ సమీపంలో మాజీ ప్రధాని, భారత భాగ్య విధాత పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఆయన కుమార్తె ఎమ్మెల్సీ వాణిదేవీతో కలిసి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఊయ్యాలవాడ వద్ద సుఖజీవన్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ శ్రేయో హిజ్ఞానమభ్యాసాజ్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాంతిరనం తరమ్ అంటే...సాహిత్యం ఆయన శ్వాస, రాజకీయం ఆయన ధ్యాస, చాణక్యానికి కాణాచి, సంస్కరణలకి ఆయన పెన్నధి... అతనే పాములపర్తి వెంకట నరసింహారావు (కర్మయోగి) అని అన్నారు. రాజీవ్‌గాంధీ పాలనలో భారతదేశం క్షీణించడం ప్రారంభమైందని,



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి



పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆ తర్వాత పరిపాలించిన నేషనల్ ఫ్రంట్ పాలన వలన దివాలాకి దగ్గర్లో ఉండేదని, 1991లో జరిగిన బాంబు దాడి వలన రాజీవ్‌గాంధీ చనిపోవడంతో నరసింహారావు ప్రధాని అయ్యారు. 1991 రోజుల్లో ఏమి చేయాలో తోచని పరిస్థితి, దేశమంతా కనీసం 200 వందల యేండ్లు అప్పుల్లో కూరుకుపోయే దుస్థితి ఏర్పడిందని, మన దగ్గర ఉన్న నిల్వలు కనీసం 2 వారాల పాటు దిగుమతులు చేసుకోలేని అగమ్యగోచరకరమన్నారు. దేశమే దివాళ అవుతున్న తరుణంలో అప్పుల ఊబిలో కూరుకుపోయిన సమయంలో దేశానికి పీవీ ప్రధాని అయి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. లిబరైలేజేషన్, గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ అనే ఎల్‌పీజీ మంత్రంతో దేశ ఆర్థిక ప్రగతి గాడిన పడటమే కాదు, పరుగులు పెట్టించిన ఘనుడు పీవీ నరసింహారావు అని అన్నారు. 17 భాషాలు, దేశీయ మరియు స్పానిష్, ఇంగ్లీష్, జర్మన్, ఫ్రెంచ్ మాట్లాడటమే కాదు ఆయా భాషాల్లో నిష్ణాతుడు పీవీ అని అన్నారు. అత్యంత సంక్లిష్టమైన వేయిపడగలని హిందీలోకి తర్జుమా చేశాడని కొనియాడారు. మన దేశం ఆర్థికంగా, సామాజికంగా, సైనిక పరంగా బలంగా ఉండటానికి ప్రధాన కారణం పీవీ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీ గారిని ఘనంగా స్మరించుకోవడం, ఆయన శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# రాబోయేది కెసిఆర్ పాలనే...!!

**దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి.. భూత్పూర్‌లో డబుల్ బెడ్ ఇళ్ల పట్టాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆల..**

**భూత్పూర్,జూలై 30 ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని సిద్ధాయిపల్లి వద్ద నిర్మితమైన 288 డబుల్ ఇళ్ల పట్టాలను దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం భూత్పూర్ పట్టణంలోని కెవిఎన్ ఫంక్షన్ హాల్‌లో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ దేశంలోని 17 రాష్ట్రాలలో బిజెపి అధికారం చెలాయిస్తుందని ఆయా రాష్ట్రాలలో అమలులో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కెసిఆర్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు మొదలు ఎరువులు, పంట కోసుకుని కొనుగోలు వరకు ప్రభుత్వం బాధ్యత వహిస్తూ, రైతుబంధు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణనేనని స్పష్టం చేశారు. ఇతర పార్టీలు బిజెపి, కాంగ్రెస్‌లు ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజల్ని మభ్యపెట్టేందుకు చూస్తారని ఇటువంటి పార్టీలతో కదు జాగ్రత్తతో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్, టిడిపి పాలనలో కేవలం రూ. 200లు మాత్రమే ఉండేదని, తెలంగాణ ప్రభుత్వం రూ. 2 వేలకు పెంచి అర్హులైన లబ్దిదారులకు అందజేస్తోందని తెలిపారు. సీఎం కెసిఆర్ నేతృత్వంలోని తెలంగాణలో లబ్ది పొందుతున్న లబ్దిదారులు రాబోయే ఎన్నికల్లో సీఎంగా కెసిఆర్ తిరిగి అధికార పీఠ దక్కేందుకు నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులకు కృషిచేసి మూడోసారి కెసిఆర్‌ను సీఎంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్‌తో పాటు, ఎంపిపి, ఛైర్మన్ కదిరే శేఖర్‌రెడ్డి, తహసిల్దార్ చెన్నకిష్టన్న, జిల్లా మత్స్య సహకార సంఘం ఛైర్మన్ మానుమోని సత్యనారాయణ, సింగిల్ విండో ఛైర్మన్ అశోక్‌రెడ్డి, ముడా డైరెక్టర్లు సత్తూరు



డబుల్ బెడ్ ఇళ్ల పట్టాలు పంపిణీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చంద్రశేఖర్‌గౌడ్, మూస సాయిలు, మండల రైతుబంధు అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు సత్తూరు నారాయణగౌడ్, టి. మురళీధర్‌గౌడ్, మూసబాలస్వామి, రామకృష్ణ, సత్తూరు అశోక్‌గౌడ్, ఆగిరి వెంకటేష్, గడ్డం రాములు, గడ్డం ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆల



సీనియర్ జర్నలిస్టు వెంకటయ్యకు పట్టా ఇస్తున్న మున్సిపల్ ఛైర్మన్, తహసిల్దార్

## నియోజకవర్గానికి రూ.5కోట్లు మంజూరు..!

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 30 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ భవనాలు నిర్మించడానికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.5కోట్లు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. సీఎం కేసీఆర్ స్పందించి రూ. 5కోట్లను మంజూరు చేస్తూ జీవో నెం.299ను విడుదల చేశారు. అడిగిన వెంటనే అభివృద్ధి పనులకు రూ.5కోట్ల నిధులు మంజూరు చేయడంతో సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.



## బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,జూలై30,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌కి బాధ్యతలు అప్పగిస్తు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌కు నియామక పత్రం అందజేశారు. నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్తగా వంగూరు ప్రమోద్ రెడ్డి, వనపర్తి పట్టణ సమన్వయ కర్తగా అరుణ్ ప్రకాష్, సీనియర్ సమన్వయకర్తగా రాము లు యాదవ్‌లను నియమించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.... 60 ఏళ్లల్లో జరగని అభివృద్ధి 9 ఏళ్లలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిందని, అన్ని రంగాలలో తెలంగాణ అభివృద్ధి చెందిందని ఆయన అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు. గడప గడపకు బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు చేరేలా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## సొంతగూటికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రాధాఅమర్

**టీపీసీసీ అధ్యక్షుడి సమక్షంలో పార్టీలో చేరిన రాధాఅమర్ దంపతులు**



కండువా కప్పి రాధాఅమర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 30, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. సుదీర్ఘపాటు కాంగ్రెస్ పార్టీలో ఉండి మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. తదనంతరం 2014 అసెంబ్లీ సాధారణ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018 వరకు పార్టీలో కొనసాగిన దంపతులు కొంతకాలంగా రాజకీయాలకు కాస్త దూరంగా ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ చేరుతారనే ఊహాగానాలు తెరలేచాయి. ఈక్రమంలో ఆదివారం రాధాఅమర్ దంపతులు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ నేత సంపత్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్‌తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ మహిళా అధ్యక్షురాలు వసంతరాఘవేందర్‌రాజు తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన జిల్లా ఫొటో విడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు

**గద్వాల ప్రతినిధి, జులై 30 ప్రభాతవార్త :** జిల్లా ఫోటో అండ్ విడియో గ్రాఫర్ అసోసియేషన్ సంఘం నుండి గద్వాల జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ఫొటో విడియో గ్రాఫర్స్ కమ్యూనిటీ హాల్ గురించి వినతిపత్రం ఇచ్చారు. బ్యాంకు లోన్ల గురించి అడగడం జరిగింది. మన జిల్లాలో కమ్యూనిటీ ఇవ్వాలని జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ శేఖర్, జిల్లా జనరల్ సెక్రెటరీ యము నరసింహయ్యశెట్టి, జిల్లా ఉపాధ్యక్షులు కొంకతి వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి. వెంకట్‌రాములు, కుమార్, ముని, తిరుమలేష్, రాజు, నరేష్ ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఖాళీ ఉన్నాయో చూసి చేస్తామని చెప్పారు.



## ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడికి మాతృ వియోగం

**బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**

**వనపర్తి టౌన్, జూలై30, ప్రభాతవార్త:** జిల్లాకేంద్రంలోని దళితవాడలో ఎంఎసన ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మాతృమూర్తి గద్వాల సవరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదివారం వనపర్తి పట్టణంలోని గద్వాల కృష్ణ నివాసానికి వెళ్లి మృతి చెందిన గద్వాల సవరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. మందకృష్ణ మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కేశవులు, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు గంధం గట్టయ్య, గంధం నాగరాజు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు , హెల్త్ డిపార్ట్‌మెంట్ గంధం రత్నయ్య, మహాజన పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు రవి ప్రసాద్ ఉన్నారు.



## పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మనెంట్ చేసిన ఘనత బీఎస్పీ పార్టీదే

**- బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జీ నాగనమోని చెన్నరాములు**



**వనపర్తి టౌన్, జూలై30, ప్రభాతవార్త:** బీఎస్పీ అధినేత్రి కుమారి మాయావతి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలోనే మొట్టమొదటి సారి గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మనెంట్ చేసిన ఘనత దేశంలో బీఎస్పీ పార్టీకే దక్కిందని బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జీ నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ అన్నారు. బీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్ధతుగా నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సమ్మె విరమణకు చర్చలు జరపాలని బీఎస్పీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నదని, బీఎస్పీ నాయకులు కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్మికులు అన్ని మండలాల సెక్టార్, బూత్ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద వితరణ




**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 30 ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ఎన్నికైన బాబురావు జన్మదినాన్ని పురస్కరించు కొని నాగర్‌కరూ ్నల్ లయన్స్‌క్లబ్ ఆధ్వ ర్యంలో జ్ఞానేశ్వర్ వత్సాల్య మందిరంలో ని అనాధ విద్యార్థులకు అన్నపసాద పం పిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గవర్నర్ రాధకృ ష్ణ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక రకాల సేవలు నిర్వహించడం అభినందనీయమని, క్లబ్ తరుపున తమ సేవలను విస్తృత పర్చాల ని కోరారు. ఆశ్రమం చక్కగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఆశ్రమ విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావా లన్న లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సభ్యులు హకీమ్ విశ్వప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, తెప్ప శ్రీను, ఆశ్రమ బాధ్యులు ఆకారపు విశ్వనాథం, నరహరి, బాలస్వామి, రామనాథం తదితరులు ఉన్నారు.

## వివాహిత అదృశ్యం... కేసు నమోదు..

**వెల్దండ, జూలై30 ప్రభాతవార్త:** తల్లిగారింటికి వివాహిత వచ్చి అదృశ్యమైన ఘటన వెల్దండ మండలం కొత్త తాండలో చోటు చేసుకుంది. కొత్త తాండకు చెందిన ఇస్లావత్ దస్లీ కుమార్తె లక్ష్మి ఆమె తన అత్తాగారింటి నుంచి ఈ నెల 29న కొత్త తాండకు వచ్చి మధ్యాహ్నం 11 గంటలకు వచ్చింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. చుట్టు ప్రక్కల, సమీప బంధువుల ఇండ్లలో ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం ఇస్లావత్ దస్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కోసం నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి...

**కల్వకుర్తి, జూలై 30 ప్రభాతవార్త:** ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కోసం మంగళవారం నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శివ్వ జగదీశ్వర్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొండూర్ గోవర్ధన్‌లు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీతో ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని ఆర్డీఓకు వినతి పత్రం అందించాలన్నారు. డివిజన్ ఆర్యవైశ్య సోదరులందరు అధిక సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పసి బాలుడు మృతి..

**- ఊపిరితిత్తుల్లోకి పాలు చేరడంతో జరిగిన సంఘటన**

**వనపర్తి వైద్య విభాగం, జూలై30, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో మూడు నెలల పసి బాలుడు మృతి చెందాడు. బాలుడిని తల్లి పడుకోబెట్టి పాలు ఇవ్వడంతో సరం పడి ఊపిరితిత్తుల్లోకి పాలు చేరి బాలుడు మృత్యువాత పడిన సంఘటన శనివారం అర్ధరాత్రి దాదాపు 11:30 గంటలకు చోటు చేసుకుంది. బాలుడిని బ్రతికించేందుకు వైద్యులు ఎంతో కృషి చేసిన ఫలితం దక్కలేదు. ఇప్పటి వరకు బాగానే ఉన్న తమ కుమారుడు ఇంతలోనే ఎలా చనిపోయాడని కుటుంబ సభ్యులు వైద్యులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని, అనుమానం ఉంటే పోస్టుమార్టం చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అయినా కుటుంబ సభ్యులు వినిపించుకోకపోవడంతో వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు బాలుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో అర్ధరాత్రి రెండు గంటలకు బాలుడి మృతదేహంతో కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. ఈనెల 24న కోడేర్ మండలం ముత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చెన్నకేశవులు దంపతులు మూడు నెలల బాబుకు ఆయాసం ఉండడంతో ఆసుపత్రికి వచ్చి అడ్మిట్ అయ్యారు. దాదాపు కోలుకుంటున్నాడు అని అనుకుంటున్నా సమయంలో బాలుడికి శనివారం అర్ధరాత్రి ఇలా జరిగిందని వైద్యులు తెలిపారు.

# నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయం ప్రారంభం..

**పాల్గొన్న మాజీ ఐఏఎస్ మురళి, డా.పృథ్విరాజ్ యాదవ్, గొంగళ్ల రంజిత్‌కుమార్**
**ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు**





నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**ధరూర్, జులై 30 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నూతన కార్యాలయాన్ని ముఖ్య అతిథులు ఆకునూరి మురళి మాజీ ఐఎఎస్, ఎస్డీఎఫ్ రాష్ట్రకన్వీనర్, డా.సంగంరెడ్డి పృథ్విరాజ్ యాదవ్, గొంగళ్ల రంజిత్‌కుమార్, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆకునూరి మురళి, డా సంగంరెడ్డి పృథ్విరాజ్ యాదవ్, గొంగళ్ల రంజిత్‌కుమార్‌కు నడిగడ్డ హక్కుల పోరాట సమితి ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. నూతన కార్యాలయ ప్రారంభం అనంతరం మహనీయులు మహాత్మాజ్యోతిరావు, సావిత్రిభాయిపూలే, డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ముఖ్య అతిథులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆకునూరి మురళి మాజీ ఐఎఎస్, ఎస్డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో బలమైన బహుజన నాయకత్వాన్ని పెంపొందించానికి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పేద వర్గాలను ఐకమత్యం చేస్తూ ధృఢ సంకల్పంతో బహుజనవాదం నిలబెట్టాలని అనేక సమస్యలపై పోరాటం చేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితికి అలాగే నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ సమితిలో సైనికుడిలా పనిచేస్తు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. డా. సంగంరెడ్డి పృథ్విరాజ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ఉద్యమాల పురిటిగడ్డ ఈ నడగడ్డ ప్రాంతమని, ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులు, అధికారాన్ని శాసిస్తున్నారని అలాంటి సందర్భంలో ప్రశ్నించే గొంతుకగా ఈ నడిగడ్డ ప్రాంతంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అనేక సమస్యలపై పోరాటం చేస్తుందని ముందుకు సాగుతోందని అన్నారు. జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ,బిసి, మైనార్టీ పేద వర్గాల తరపున ప్రజల ఆశీర్వాదంతో గద్వాల మార్పుకై పునాదులు వేస్తామని, విద్య, వైద్య,సంక్షేమం అభివృద్ధికై నడిగడ్డ హక్కుల పోరాట సమితి అనేక రకాలుగా పోరాటం చేస్తూ ముందుకు కొనసాగుతామని అన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు ఆలూరు వెంకట్రాములు, పరశురాముడు, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు, ఉపాధ్యక్షులు మునెప్ప, ఆంజనేయులు, తిమ్మప్ప కార్యదర్శిలు రాము, సీఎం రాము, సహాయ కార్యదర్శి రామకృష్ణ, తిప్పన్న, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాంతన్న, గ్రామ అధ్యక్షుడు అడివి ఆంజనేయులు, కృష్ణ, జగదీష్, కె. కృష్ణ, కిష్టన్న, వెంకటేష్, బరాస ఆంజనేయులు, దరెప్ప, నర్సింహులు, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి తిమ్మప్ప, నాయకులు కిష్టన్న, భూపతి, గోపాల్, చిన్నరాముడు, సర్వేష్,గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు, కెటిదొడ్డి మండల సమన్వయ కర్తలు అంజి, భీమన్‌గౌడ్, దస్తగిరిగౌడ్, ఏసన్న, నాయకులు, నాగేష్, రాములు, వీరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండలో ఘనంగా తిరుచ్చిసేవ..

**- అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి దర్శనం**



అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారు



మన్యంకొండలో స్వామివారి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పూజారులు

**దేవరకద్ర, జులై30 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తుల హరినామశ్మరణ, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిధ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జీన్గరాలలో ముగిసిన మొహర్రం వేడుకలు..!



జీన్గరాలలో పీర్ల వద్ద ఫాతెహాలు ఇప్పిస్తున్న భక్తులు

**దేవరకద్ర జులై 30 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం జీన్గరాలలో మొహర్రం వేడుకలు శనివారం అర్ధరాత్రి ఘనంగా ముగిసాయి. ప్రతి ఏడాది జీన్గరాలలో మొహర్రం వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ మొహర్రం వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపురవీధుల గూండా పీర్ల ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు యుగేందర్, నరసింహ్మారెడ్డి, బలరాం, ఉస్మాన్, గ్రామపెద్దల అధ్వర్యంలో ఈ వేడుకలను ఎంతో భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను రకరకాల వెండి ఆభరణాలు, పూలతో అలంకరించి ఊరేగించారు.. అలాగే మండలంలోని కౌకుంట్ల, గోపన్‌పల్లి, పెద్దరాజమూర్, చౌదర్‌పల్లి, జీన్గరాల, గద్దెగూడెం, డోకూర్ గ్రామాలలో మొహర్రం వేడుకలను సాంప్రదాయరీతిలో నిర్వహించారు. దాదాపు వారం రోజుల పాటు ఆయా గ్రామాలలో ఈ మొహర్రం వేడుకలను ఘనంగా ఐక్యమత్యంగా నిర్వహించారు. ప్రతి రోజు అలై, బలై అడటంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను పీర్ల చావిడీల వద్ద నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఆయా గ్రామాలలోని పీర్ల మజీదులను రకరకాల విధ్యుత్‌బల్బులతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. ఈ సందర్భంగా మొక్కుబడి గల భక్తులు పీర్లకు దట్టీలు కప్పి ఫాతెహాలు ఇప్పించారు. దీంతో ప్రతి రోజు పీర్ల మసీదుల వద్ద సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో మండలంలో పీర్ల వేడుకలు ముగిసాయి.

# ఆకులు, అలములు తింటు నిరసన..

**- 25వ రోజుకు చేరిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె**



ఆకులు, అలములు తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు

**వనపర్తి టౌన్, జూలై30, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 25వ రోజుకు చేరుకోవడంతో ఆకులు, అలములు తింటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ... పండుగలు, వర్షాలు ఏవీ గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు ఆటంకం కావడం లేదని, పీర్ల పండుగ వచ్చినా, వర్షాలు ఎంత భారీ వర్షాలు కురిసినా సమ్మె మాత్రం యధావిధిగా కొనసాగుతున్నదని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి తక్షణం జేఏసీతో చర్చలు జరిపి గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో చలో హైదరాబార్ కార్యక్రమానికి కార్మికులంతా సిద్ధమవుతున్నారని, ప్రగతి భవన్ ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్మికులకు ఇస్తున్న వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా లేవని మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్లుగా రూ.15600, రూ.19500 ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మల్టీపర్పస్ వర్కర్ పద్ధతిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ మండల నాయకులు హన్మంత్, పరుశరాములు, శ్రీనివాసులు, బాలకృష్ణ, స్వామి, నర్సమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలి...



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

**కల్వకుర్తిరూరల్, జూలై 30 ప్రభాతవార్త:** పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె ఆదివారం 25వ రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె శిబిరానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రంలో శ్రమ జీవులను వేధించడం సరైంది కాదని, పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే కార్మికుల సంఘాలతో పాటు ప్రజాస్వామ్య వాదులు, సామాజిక సంఘాలను కలుపుకొని సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నాయకులు కానుగుల దశరథం, నాయకులు శంకర్, అర్జున్, మల్లేష్, హుస్సేన్, చంద్రయ్య, బాలమైసమ్మ, వెంకటమ్మ తదితరులు ఉన్నారు.

## గౌడ సంఘం తాలూకా ఉపాధ్యక్షుడిగా తిర్మన్‌దాస్ నాగరాజుగౌడ్ ఎన్నిక



**వెల్దండ, జూలై30 ప్రభాతవార్త:** వెల్దండమండలం కొత్త గ్రామానికి చెందిన తిర్మన్‌దాస్ నాగరాజుగౌడ్ కల్వకుర్తి తాలూకా గౌడ సంఘం ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్‌ను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైసిగండి శ్రీనివాస్‌గౌడ్, వెల్దండ గౌడ సంఘం మండల అధ్యక్షులు మట్ట వెంకటయ్యగౌడ్‌లు పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, తాలూకా కమిటీ సభ్యులకు తిర్మన్‌దాస్ నాగరాజుగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఫోన్ రికవరి చేసిన పోలీసులు



**దేవరకద్ర, జులై30 ప్రభాతవార్త:** దేవరకద్ర పోలీసులు ఫోన్ రికవరి చేసి ఆదివారం బాధితుడికి అందశారు. సిఇఐఆర్ పోర్టల్ ద్వారా దానిని రికవరి చేశారు. వివరాలు ఈవిదంగా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలం గోటూర్‌కు నెందిన తేజ అనే యువకుడు గత రెండు నెలల క్రితం దేవరకద్ర సంతలో తన ఫోన్‌ను పోగొట్టుకొన్నాడు. దీంతో అప్పట్లో తేజ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఆ ఫోన్‌ను రికవరి చేసి దేవరకద్ర పోలీసులు బాధుతుడికి అప్పజెప్పారు.

## గోవులను పూజిద్దాం...



**కల్వకుర్తి, జూలై 30 ప్రభాతవార్త:** సమాజంలో రోజు రోజుకు అంతరించిపోతున్న గో సంపదను కాపాడుకొని గోవులను పూజించాలని లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ జి.బాబురావు జన్మదినం సందర్భంగా పట్టణంలోని గోషాలలో ఆదివారం గోసేవా నిర్వహించారు. గోవులకు దాణా, పండ్లు, ఆకుకూరలు ఆహారంగా అందించారు. ఈ సందర్భంగా కలిమిచెర్ల రమేష్ మాట్లాడుతూ గోవును పూజిస్తే సుఖ సంతోషాలతో జీవనం సాగించవచ్చునన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిగుళ్లపల్లిశ్రీధర్, కోశాధికారి గోవింద్ శ్రీనివాస్, మెంబరిషిప్ కమిటీ ఛైర్మన్ గుబ్బ కిషన్, దొంతుశ్రీనివాస్, గందే శ్రీధర్ ఉన్నారు.

## పాత్రికేయుడు కుటుంబాన్ని పరామర్శ..



**వంగూరు, జూలై30 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు పెరుమాళ్ల వెంకటయ్య తండ్రి పి.చెన్నయ్య ఇటీవల అకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు జాజాల గ్రామానికి చేరుకొని చెన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కుటుంబ సభ్యులను పరామర్శించి జెడ్పీటీసీ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టారెడ్డి, లక్ష్మయ్య, ఆంజనేయులు, జానీపాషా, అశోక్‌రెడ్డి, సైదులు, చిన్న నాగయ్య, నాగరాజు, నాగయ్య, దామోదర్, సాయిలు, బురాన్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# మల్కాపూర్‌లో శివాలయం నిర్మాణానికి మేఘారెడ్డి ఆర్థిక సాయం..!

**- అడిగిన వెంటనే స్పందించిన మేఘారెడ్డికి ధన్యవాదాలు తెలిపిన గ్రామస్తులు**



శివాలయ నిర్మాణానికి మేఘారెడ్డి తరపున ఆర్థిక సాయం అందజేస్తున్న రమేష్ గౌడ్

**జల్లాఘణపురం, జూలై30, ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గ పరిధిలోని జల్లాఘణపురం మండలం మల్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి వనపర్తి నియోజకవర్గ నాయకులు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ.1 లక్ష 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో దేవాలయం నిర్మాణానికి గ్రామస్తులు సిద్ధమై ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఆయన జల్లాఘణపురం మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్ కు రూ.1లక్ష 50వేలు ఇవ్వగా ఆదివారం రమేష్ గౌడ్ మల్కాపూర్ గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో సమావేశమై రూ.1లక్ష 50వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు మేఘారెడ్డికి మల్కాపూర్ గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శివయ్య ఆశీస్సులు మేఘారెడ్డికి ఎల్లప్పుడు ఉండాలని అనుకున్న విజయాన్ని సిద్ధించాలని వారు దీవించారు. ఈ కార్యక్రమంలో సురేందర్ గౌడ్, సోలీపూర్ ఖలీల్, గ్రామ పెద్దలు మాజీ ఎంఈవో కొండారెడ్డి, పీఈటీ కొండారెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, మాజీ ఎంఈవో మన్యపురెడ్డి తదితరులు ఉన్నారు.

### పంట పొలాలను పెట్టుబడిదారులకు
## అప్పజెప్పడానికే ఇథనాల్ కంపెనీ పెట్టారు..

**మొదటి పేజీ తరువాయి భాగం...**

లక్ష్మయ్య, ఎక్లాస్‌పూర్ రైతు మండలి నాయకులు రామచంద్రయ్య, మధు చిత్తనూరు మహిళా మండలి నాయకులు వెంకటేశ్వరమ్మ, ఆనంద్, నిర్వాసితుల వ్యతిరేక పోరాట కమిటి నాయకులు అనిల్, టిపిఎఫ్ నాయకులు మన్యంకొండ పాల్గొన్నారు. ప్రొ॥ రత్నం మాట్లడుతూ ఇథనాల్ పాలసీ రైతులకు వ్యతిరేకమైనదని, వ్యవసాయానికి వ్యతిరేకమైనదని అన్నారు. ఆ కంపెనీ ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని మాట్లాడడం ఒట్టి బూటకమని అన్నారు. ఎందుకంటే ఒకవైపు చదువుకునే అవకాశాలు తగ్గిస్తూ, విద్యను ప్రైవేట్ పరం చేస్తూ యూనివర్సిటీలను ప్రైవేట్ కార్పోరేట్ వాళ్లకు అప్పజెబుతూ మరోవైపు ఉద్యోగాలు ఇస్తామనడం ఒట్టి బూటకం తప్ప వేరే కాదన్నారు. ఆ కంపెనీలో ఉద్యోగాలన్ని కూడా నాలుగో తరగతి అంటే స్వీపర్లుగా, అటెండర్లుగా తుడిచే, ఊడ్చే పని తప్పితే టెక్నిషియన్స్, మేనేజర్స్‌గా ఇటువంటి ఉద్యోగాలన్ని ఏమి లేదని అన్నారు. మొత్తంగా రైతు వ్యతిరేక ఇథనాల్ పాలసీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రద్దుచేసి వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పరిశ్రమలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో చిత్తనూరు, జిన్నారం, ఎక్లాస్‌పురం, కనుమనూరు తదితర బాధిత గ్రామాల ప్రజలు సుమారు 100 మంది పాల్గొని ఈ ధర్నాను విజయవంతం చేశారు.

## ఆగస్టు 5వ తేదీన శ్రీనివాస కళ్యాణోత్సవం

**మక్తల్, జులై 30 ప్రభాతవార్త :** పట్టణంలోని వట్టెం రవి కన్వెన్షన్ హాల్‌లో బ్రాహ్మణ్‌వాడిలోని వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీ శనివారం శ్రీనివాస కళ్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందని అర్చకులు శ్యాం సుందర్ జోషి, రాఘవేందరాచార్య తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని రవి కన్వెన్షన్ హాల్ నిర్వాహకులు వట్టం రతన్‌కుమార్ గుప్తా, వట్టం అనూష, వట్టం శేఖరయ్య, వట్టం పుష్పవతి సహకారంతో కళ్యాణోత్సవం జరిపిస్తున్నామని అన్నారు. అధికమాసం పురస్కరించుకుని 33 మంది పుణ్య దంపతులచే శ్రీ భూసమేత శ్రీనివాస కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నామని, సాక్షాత్తు తిరుమల నుంచి తీసుకువచ్చిన శ్రీవారి ఉత్సవ మూర్తులకు కళ్యాణోత్సవం జరిపిస్తున్నామని, అన్నదాన కార్యక్రమం సైతం ఉంటుందని పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో కళ్యాణోత్సవానికి హాజరు కావాలని కోరారు. కళ్యాణోత్సవ కార్యక్రమం నుంచి ఫంక్షన్ హాల్‌లో సెంట్రల్ ఏసీ సౌకర్యం సైతం అందుబాటులోకి వస్తుందని వట్టం రతన్ తెలిపారు. కార్యక్రమంలో విజయేంద్రాచారి, శ్రీనివాస్ దీక్షిత్, వంశీక్రిష్ణ జోషి పాల్గొన్నారు.



## సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి వినతి**

**దేవరకద్ర, జులై 30 ప్రభాతవార్త :** సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులందరూ ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యను ముఖ్యమంత్రి తీసుకెళ్లి ఖచ్చితంగా మీ సమస్యను పరిష్కారం చేసే విధంగా నేను తప్పకుండా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వీలైతే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి, అదేవిధంగా ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాకిటి అరుణ దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీ సమావేశాల్లోగా మీ సమస్యను చర్చించి మీకు న్యాయం చేయడానికి నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దాదాపు దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులు అదేవిధంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జెఎసి అధ్యక్షులు కె. శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ కె. యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌శ్రీనివాసులు, కోశాధికారి ఎండి విక్రమ్, మొగులయ్య, ఇంతియాజ్, డేవిడ్, హర్షకుమార్, వేణుగోపాల్, మైబన్న, వసంత, కవిత, చెన్నయ్య, యాదయ్య, నాగరాజు పాల్గొన్నారు.



## ప్రభుత్వం సీడ్ పత్తి రైతులను ఆదుకోవాలి..

**టిపిసిసి అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి**

**అయిజ, జులై 30 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలో సాగు చేస్తున్న సిడి పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిపిసిసి అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొన్ని సంవత్సరాలుగా ప్రతి పంటకు గులాబీ రంగు పురుగుపడి తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సంవత్సరం వర్షాలు లేక పత్తి పంటలు కొంత నష్టపోగా మరల వర్షాలు ఎక్కువ పడి తేమశాతం ఎక్కువై ఉన్న పత్తిపంటలు కూడా దెబ్బతిన్నాయని దీంతో రైతులు ఎటు తోచని పరిస్థితిలో అయోమయంలో ఉన్నారని జిల్లా ఇంఛార్జి వ్యవసాయశాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని వెంటనే ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిత్తల దేవరాజ్, అడ్వకేట్ మధు, జయన్న, దొడ్డప్ప, రాణమ్మ, సాంబశివుడు, మైనర్‌బాబు, బసవరాజు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్, జులై 30 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మున్సిపల్ 5,6 వార్డుల అధ్యక్షుడు మూస బాలస్వామి జన్మదిన వేడుకలు ఆదివారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కెవిఎస్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, ఎంపిపి కదిరె శేఖర్‌రెడ్డి, నాయకులు తూము శ్రీనివాస్‌రెడ్డి, సత్తూరు నారాయణగౌడ్, మేకల సత్యనారాయణ, సత్తూరు అశోక్‌గౌడ్, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించకపోతే ఛలో అసెంబ్లీ..

**జిల్లా ఉద్యోగ, కార్మిక సంఘాల జెఎసి ఛైర్మన్ నల్లవెల్లి కురుమూర్తి**

**భూత్పూర్, జులై 30 ప్రభాతవార్త :** తమ డిమాండ్ల సాధనకు గత పాతిక రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్నప్పటికి అధికారులు, ప్రజాప్రతినిధులకు చీమ కుట్టనట్లయినా లేదని కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే కార్మికులతో ఛలో అసెంబ్లీ నిర్వహిస్తామని జిల్లా ఉద్యోగ, కార్మిక జెఎసి ఛైర్మన్ నలవెల్లి కురుమూర్తి హెచ్చరించారు. ఆదివారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న ధర్నాకు కురుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కురుమూర్తి మాట్లాడుతూ కార్మికులకు 11వ పీఆర్సీ, 60వ జిఓ ప్రకారం పారిశుద్ధ్య కార్మికుడికి రూ. 15 వేల 600లు, బిల్ కలెక్టర్లకు రూ. 19 వేల 500లు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.



# బిఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు అండగా నిలిచిన పార్టీ..

**ప్రపంచ దేశాలు సీఎం కెసిఆర్ వైపు చూపు**
**త్వరలోనే ఇండ్ల పట్టాల పంపిణీ**
**గద్వాల అభివృద్ధి లక్ష్యంతో ఎమ్మెల్యే**
**బిఆర్ఎస్ పార్టీ ముఖ్య**
**కార్యకర్తల సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



హాజరైన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు

**గద్వాల ప్రతినిధి, జులై 30 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బిఎస్ కేశవ్ హాజరయ్యారు. గద్వాల టౌన్ అధ్యక్షుడు గోవింద్ ఎమ్మెల్యేకు, ఛైర్మన్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గతంలో గద్వాల పట్టణం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేకపోయింది. పట్టణంలో సరైన మౌలిక సదుపాయాలు లేక రోడ్డు డ్రైనేజీ నిర్మాణము నీటి సౌకర్యం లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది. నేడు 8 సంవత్సరాలలో సీఎం కెసిఆర్ నేతృత్వంలో గద్వాల పట్టణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేకమైన సంక్షేమ పథకాలను లాంటి మధ్యవర్తి లేకుండా నేరుగా లబ్ధిదారుడు లబ్ధి పొందే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పార్టీలకతీతంగా అన్ని వార్డుల్లో గద్వాల టౌన్ డ్రైనేజీ నిర్మాణం, సిసి రోడ్లు పార్కులు, ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో ఎండలు లేనివిధంగా కెసిఆర్ నేతృత్వంలో కెటిఆర్ సహకారంతో గద్వాల మున్సిపాలిటీ చేసుకోవడం జరిగింది. వీటితో పాటు ప్రత్యేకంగా కొత్త బస్టాండ్ ఇంటిగ్రేట్ మార్కెట్, ఆడిటోరియం, ప్రధాన రహదారిలో బిటి రోడ్లు, సెంట్రల్ లైటింగ్, ఆర్‌ఓబి ఫ్లైఓవర్, 300ల పడకల ఆసుపత్రి నర్సింగ్ కాలేజ్, అనేకమైన అభివృద్ధి గద్వాల పట్టణంలో కొనసాగడం జరుగుతుంది. భవిష్యత్తులో గద్వాల పట్టణాన్ని రాష్ట్రంలోని నంబర్ వన్ తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తామని తెలిపారు. గతంలో విద్య, వైద్య రంగంలో గద్వాల ప్రాంతం చిట్టచివరిగా ఉండేది. నేడు తెలంగాణ రాష్ట్రంలో గద్వాలలో విద్యాపరంగా గురుకుల పాఠశాలలు కస్తూర్బా పాఠశాలలు, డిగ్రీ కాలేజీ పిజి కాలేజీ నర్సింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ దూర ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లి అవసరం లేకుండా అన్ని విషయాలను గద్వాలలోని చదువుకునే విధంగా అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుంది. గతంలో ప్రభుత్వాసుపత్రిలో సరైన మౌలిక సదుపాయాలు వైద్యులు లేక ఎంతో మంది పేద ప్రజలు కర్నూలు హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి వారు నేడు అలాంటి పరిస్థితి లేకుండా గద్వాల అన్ని రకాల వైద్యులకు సంబంధించి పరికరాలు వైద్యులు అందుబాటులో ఉండి పేద ప్రజలకు మెరుగైన వైద్యమును అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్తలను కాపాడుకుంటామని డబుల్ బెడ్‌రూమ్‌లో ఇల్లు రాని వారికి త్వరలోనే గృహలక్ష్మి పథకంలో, ప్రాధాన్యత కల్పిస్తూ, ఇంటి పట్టాలను కూడా త్వరలోనే అందిస్తామని తెలిపారు. ఛైర్మన్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాల వల్ల సాధ్య కాని గద్వాల అభివృద్ధి పనులు సీఎం కెసిఆర్ నేతృత్వంలో మంత్రి కెటిఆర్‌ని సారథ్యంలో ఎమ్మెల్యే సహకారంతో గద్వాల పట్టణంలో ఎన్నడు ఎప్పుడు లేని విధంగా ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ప్రతి వార్డులను కూడా అభివృద్ధి వైపు పరుగులు తీసే విధంగా కృషి చేయడం జరిగింది. ఇప్పటికే దాదాపుగా 100 కోట్ల రూపాయలు గద్వాల పట్టణ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం జరిగింది. భవిష్యత్తులో మిగిలి పోయిన అభివృద్ధి కార్యక్రమాలలో పూర్తి చేసుకుని గద్వాల పట్టణం రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థాయికి గద్వాల పట్టణాన్ని ఎమ్మెల్యే సహకారంతో తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబర్, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కోడిగుడ్ల సలాం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో కలవరపెడుతున్న కళ్ళకలకలు..!

**- భయపడాల్సిన అవసరం లేదంటున్న వైద్యులు**
**- సొంత వైద్యం చేసుకోరాదని సూచన**
**- జాగ్రత్తలతో త్వరగా నిరోధించవచ్చు**



**దేవరకద్ర, జులై 30 ప్రభాతవార్త:** వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయి. ప్రధానంగా కంటి సంబందిత సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. అందులో కళ్ళకలకలు ఒకటి. అయితే దేవరకద్రలో గత కొన్ని రోజులుగా పట్టణ ప్రజలను కళ్ళకలకలు కలవర పెడుతున్నాయి. ఉన్నట్లుండి కళ్ళకు ఇన్‌ఫెక్షన్ సోకి కళ్ళు ఉబ్బిపోతూ ఎర్రబారుతున్నాయి. దీంతో ప్రజలు భయపడి ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. వర్షాకాలం కాబట్టి కళ్ళకలకలు ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలోనే ప్రబలుతుందంటున్నారు. వర్షాకాలంలో గాలిలో ఎక్కువగా ఉండే తేమ బ్యాక్టీరియాకు కారణమవుతుందంటున్నారు. ఇది కళ్ళకు ఎక్కువగా ప్రభాతవితం చేస్తుంది. దీంతో కళ్ళు ఒక్కసారిగా కళ్ళకలకల బారిన పడుతాయి.

**ఇవి కళ్ళకలక లక్షణాలు..**

కళ్ళకలక వస్తే కళ్ళు ఎర్రబారి కళ్ళ నుండి నీళ్ళు కారుతాయి. కంటి రెప్పలు బాగా వాచిపోతాయి. రాత్రి పడుకొని తెల్లవారు నిద్రలేచేసరికి కళ్ళు అతుక్కుపోతాయి. కళ్ళలో రవ్వలతో వత్తినట్లు బాద అనిపిస్తుంది. కళ్ళు ఎర్రబారడం, దురుదగా ఉండటం, కళ్ళ రెప్పల్లో వాపు, నీరుగారడం, కళ్ళ నుండి ఫ్లూయిడ్ డిశ్చార్చ్ కావడం కళ్ళకలక లక్షణాలు. కళ్ళకలక లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు పడటం అవసరం. ఎందుకంటే ఒకరి నుండి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతుంది. దేవరకద్రలో గత వారం రోజులుగా పట్టణప్రజలు కళ్ళకలకల బారిన పడుతున్నారు.

**జాగ్రత్తలు అవసరం..**


కళ్ళకలకలు వచ్చిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జాగ్రత్తలతో దీనిని త్వరగా నిరోధించవచ్చని అంటున్నారు. కంటిని తరచూ మంచి నీళ్ళతో కడుక్కోవాలి. దీని వల్ల త్వరగా తగ్గడానికి అవసరం ఆస్కారం ఉందంటున్నారు. ఇన్‌ఫెక్షన్ సోకిన వారు మిగతా వారికి దూరంగా ఉండాలి. వాళ్ల వాడిన వస్తువులు ఇతరులు వాడరాదు. వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. మురికి చేతులతో కళ్ళకు తాకరాదు. సబ్బునీటితో తరచూ చేతులు కడుక్కోవాలి. కళ్ళు దురదగా అనిపిస్తే పదేపదే కళ్ళను రుద్దకూడదు. కళ్లు తుడుచుకోవడానికి శుభ్రమైన కాటన్ క్లాత్‌ను ఉపయోగించాలి. టిష్యూ పేపర్‌ను వాడాలి. కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే కళ్ళకలక నుండి రిలీఫ్ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం కాబట్టి కళ్ళను సంరంక్షించుకోవాలని వారు సూచిస్తున్నారు. ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు ఆందోళన చెందకుండ సరియైన చికిత్రను వైద్యుల సూచనమేరకు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ఇది ఒకరకంగా అంటువ్యాధి రకమే కాబట్టి ఒకరకంగా తగు జాగ్రత్తలు మాత్రం తీసుకోవాలంటున్నారు. సొంత వైద్యం చేసుకోకుండా కళ్ళకలక వచ్చిన వారు ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. కళ్లకలకలు వచ్చిన వారి కళ్ళను చూడకూడదు. కళ్ళకలక వచ్చిన వారు ప్రయాణాలు చేయకుండా విశ్రాంతి తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



## ఇంటర్ స్టూడెంట్‌పై కుక్కలు దాడి..!

**జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలి**

**గద్వాల ప్రతినిధి, జులై 30 ప్రభాతవార్త :** గద్వాల పురపాలక సంఘం పరిధిలోని 32వ వార్డుకు చెందిన మల్లికార్జున్ ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థి ఉదయం ఎనిమిది గంటల సమయంలో గద్వాల నుంచి నది అగ్రహారంకు మల్లికార్జున్ అక్క దగ్గరకు సైకిల్‌పై వెళ్తుండగా పాత హౌసింగ్ బోర్డు జూరాల కాల్వ దాటిన కొద్ది దూరంలోనే పాలకేంద్రం సమీపంలో ఒక్కసారిగా ఐదు కుక్కలు మల్లికార్జునపై దాడికి దిగాయి. పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటు ఎవరూ లేకపోవడంతో ఐదు కుక్కలు ఒకటేసారి రావడంతో మల్లికార్జున్ గట్టిగానే పోరాడి దొర్లుకుంటూ రోడ్డు కిందకు దిగి రాళ్లతో కొట్టడంతో కుక్కలు అక్కడి నుంచి వెళ్లినట్లు తండ్రి శ్రీనివాసులు తెలిపారు. పెద్ద పిల్లలకు సైతం కుక్కలు దాడులు చేస్తుంటే మరి చిన్న పిల్లల సంగతి చెప్పనక్కర్లేదు. గద్వాల పురపాలక సంఘం పరిధిలోని ఏదో ఒక కాలనీలో పిల్లలపై, పెద్దలపై ఇలాంటి కుక్కల దాడులు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఈ విషయంపై చర్యలు తీసుకుని ఎక్కడ కూడా పిల్లలకు కానీ పెద్దలకు కానీ కుక్కలు దాడుల నుంచి ప్రమాదాలు తప్పించాలని పట్టణ ప్రజలు జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరుతున్నారు.



ఇంటర్ విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసిన దృశ్యం

## రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన మహీంద్రా షోరూం దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి..

**గద్వాల ప్రతినిధి, జులై 30 ప్రభాతవార్త :** గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన (మహీంద్రా షోరూం దగ్గర) టి. దాయ అంజి తండ్రి వెంకట్‌రాములు (35) నది అగ్రహారం గ్రామంలోని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వస్తుండగా కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యువకుడు అంజి అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

## అనారోగ్యంతో అంగన్‌వాడి కార్యకర్త మృతి

**చిన్నచింతకుంట, జులై 30 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడి కార్యకర్త జహేదాబేగం (38) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె గత కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. గూడూరు గ్రామానికి మృతి చెందిన అంగన్‌వాడి కార్యకర్త తీసుకొచ్చారు. స్థానిక ఎంపిపి హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు కాంతారావు, హరితలు పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



# ప్రెస్‌క్లబ్ భవనానికి స్థలం, నిధులు కేటాయించాలి

**టియుడబ్ల్యుహెచ్ 143 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ల పృథ్విరాజ్**
**ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్**

**మక్తల్, జులై 30 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనానికి స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని టియుడబ్ల్యుహెచ్ 143 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ల పృథ్విరాజ్, మక్తల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మామిళ్ల పృథ్విరాజ్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన ప్రెస్‌క్లబ్ భవనం కోసం గత కొన్నేళ్ల నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరులు డిమాండ్ చేస్తున్నారని, ఇప్పటివరకు మక్తల్ ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం శోచనీయమన్నారు. గత రెండు మూడురోజుల కిందట షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రెస్‌క్లబ్ నిర్మాణాల కోసం 2 కోట్ల 30 లక్షల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కోసం 50 లక్షలు, అదే నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాల్లో ప్రెస్‌క్లబ్ భవనాల నిర్మాణం కోసం తలా 30 లక్షలు కలిపి మొత్తం 2 కోట్ల 30 లక్షల నిధులు మంజూరు చేశారని అన్నారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ పట్టణంలో ప్రెస్‌క్లబ్ భవనం కోసం స్థలంతో పాటు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని 2014 వరకు ముందు ఎన్నికల్లో ఉద్యమనేత కెసిఆర్ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. సమావేశంలో జర్నలిస్టు కార్తీక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టియుడబ్ల్యుహెచ్ 143 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిళ్ల పృథ్విరాజ్

# డబుల్ బెడ్రూం విషయంలో బీఆర్ఎస్ మోసం..

**- పేదలతో ఓట్ల రాజకీయం - నేడు పాలమూరుకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాక**
**- మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 30, ప్రభాతవార్త :** డబుల్ బెడ్రూం ఇండ్ల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేస్తున్నదని, ఎన్నికలున్నప్పుడే ఇండ్ల విషయం ముందుకు తెస్తూ పేదలకు ఆశచూపి వేలల్లో దరఖాస్తులు వస్తే కనీసం వందల్లో కూడా ఇండ్లు పంపిణీ చేయడం లేదని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమవారం జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి వేలాదిగా కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని, వారికి ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి జిల్లాకు రానున్న నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా డబుల్ బెడ్రూం బాధితులతో క్లాక్‌టవర్ చైరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డబుల్ బెడ్రూం ఇండ్లతో పాటు, రైతులకు రుణమాఫీ చేయలేదని, ఉచిత ఎరువులు ఇవ్వలేదని, పింఛన్ ఇవ్వలేదని ఇలా రకరకాలుగా సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు జిల్లా కేంద్రానికి చేరుకొని బీఆర్ఎస్ పార్టీ నేతలకు కనువిప్పు కలిగేలా ర్యాలీలో పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద కిషన్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, బీజేపీ సీనియర్ నేత నాగూరావు నామాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, కృష్ణవర్ధన్‌రెడ్డి, కిరణ్, మిథున్‌రెడ్డి, ప్రవీన్‌యాదవ్, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణయాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

## 25.3ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్ నీటిమట్టం..

**కోయిలకొండ, అంకిళ్ల వాగుల నుండి వచ్చి చేరుతున్న నీరు**

**దేవరకద్ర, జులై 30 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంప్ హౌజ్ నుండి ప్రాజెక్టుకు కృష్ణ జలాల తరలింపు ఇటీవల నిలిపివేశారు. వర్షాలు పడుతుండటంతో వాటిని నిలిపివేశారు. వర్షాలు కురుస్తుండటంతో కోయిలకొండ, అంకిళ్ల వాగుల నుండి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడం ప్రారంభమైంది. దీంతో ఆది వారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు లో నీటిమట్టం 25.3 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 7.2 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.

